నమస్తే తెలంగాణ
నిజామాబాద్
3 | నిజామాబాద్, సోమవారం 10 జూన్ 2024 | NIZAMABAD

- నిజామాబాద్‌లో 77.49, కామారెడ్డిలో 78.99 శాతం హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు, అధికారులు
- కామారెడ్డిలో ఆలస్యంగా వచ్చిన ఇద్దరు అభ్యర్థులకు నో ఎంట్రీ

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్


నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కామారెడ్డిలో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

కంఠేశ్వర్/ కామారెడ్డి, జూన్ 9: ఉమ్మడి జిల్లాలో ఆదివారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలో 41, కామారెడ్డి జిల్లాలో 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిజామాబాద్‌లో 77.49 శాతం, కామారెడ్డిలో 78.99 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు.నిజామాబాద్ జిల్లాలో మొత్తం 12,833 మంది అభ్యర్థులకు 9,945 మంది పరీక్షకు హాజరుకాగా 2,888 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. కామారెడ్డి జిల్లాలో 4,797 మంది అభ్యర్థులకు 3,780 మంది హాజరుకాగా 1017 మంది గైర్హాజరైనట్లు కామారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, సమన్వయకర్త డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.

కామారెడ్డిలో పరీక్షా కేంద్రాలను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ, నిజామాబాద్ నగరశివారు మానిక్‌బండార్ సమీపంలో ఉన్న కిట్స్, ఎస్ ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తనిఖీ చేశారు. అభ్యర్థులకు ఉపయుక్తంగా ఉండేలా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. దీంతోపాటు పరీక్షా కేంద్రాల వద్ద సమగ్ర వివరాలు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలను క్షుణ్ణంగా తెలియజేస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలస్యంగా వచ్చిన ఇద్దరికి నోఎంట్రీ

కామారెడ్డి డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రానికి ఇద్దరు అభ్యర్థులు ఆలస్యంగా రాగా.. అధికారులు అనుమతించలేదు. దీంతోవారు పరీక్ష రాయకుండానే వెనుదిరిగారు.

కామారెడ్డిలో పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు

నిజామాబాద్‌లోని ఓ పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీసులు

కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ సింధూశర్మ

జోరుగా సాగు

తొలకరి పలకరించకుండానే విత్తనాలు

- పసుపు వైపు రైతుల చూపు
- పెరగనున్న పంట విస్తీర్ణం
- సోయా తగ్గిస్తున్న కర్షకులు
- దిగుబడి తగ్గడమే కారణం



మక్కజొన్నవైపు మొగ్గ

నిజామాబాద్ జిల్లాలో గతేడాది 42,043 ఎకరాల్లో మక్కజొన్న, 51579 ఎకరాల్లో సోయాపంటను రైతులు పండించగా.. ఈసారి మక్కజొన్న విస్తీర్ణం విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే మక్కజొన్న పంటను దాదాపు రెండువేల ఎకరాల్లో రైతులు విత్తుకున్నారు. రెండేండ్లుగా సోయా వేసిన రైతులు తెగుళ్ల కారణంగా దిగుబడి రాక రైతులు నష్టపోయారు. ఎకరానికి 10 నుంచి 14క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 50కిలోల నుంచి రెండు క్వింటాళ్ల వరకే వచ్చింది. దీని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. సోయా పంట దిగుబడి తగ్గినా ధరలో మార్పు లేకపోవడం కూడా రైతులను వేధించింది. అదే మక్కజొన్న పండించిన రైతులకు దిగుబడి రావడంతో పాటు ధర కూడా ఆశించినస్థాయి వచ్చింది. దీంతో ఈసారి వానకాలంలో మక్కజొన్న పండించేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈకారణంగా జిల్లాలో ఈసారి పసుపు, మక్కజొన్న విస్తీర్ణం భారీగానే పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు గతేడాది అనుభవ పాఠాలతో రైతులు పంటలు పండించేందుకు సిద్ధమవుతుండగా ఇప్పటి వరకు తొలకరి పలకరించకపోవడంతో ఆకాశం వైపు చూస్తున్నారు. వానలు బాగా కురిసి పంటలు బాగా పండి మంచి ధరలు పొందాలనే ఆశలతో రైతన్న సాగుపనులు ప్రారంభించాడు.

పెరగనున్న పసుపు సాగు విస్తీర్ణం

గతేడాది జిల్లా వ్యాప్తంగా 19,047 ఎకరాల్లో పసుపు పంటను పండించిన రైతులు ఈసారి 25వేల ఎకరాల్లో సాగుచేసే అవకాశం ఉన్నదని వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు అంచనా వేస్తున్నారు. 30వేల ఎకరాలకు వెళ్లినా ఆశ్చర్యపోనవసరం లేదన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. దీనికి కారణం గతంలో ఎన్నడూలేని విధంగా పసుపునకు రూ.20వేలకు పైగా ధర రావడమేనని తెలుస్తోంది. ఆశించిన ధర రావడం తో ఈసారి రైతులు పసుపు పండించేందుకు సిద్ధమవుతున్నప్పటికీ అమ్మేవారు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. ఒక వేళ అమ్మే రైతు దొరికినా డిమాండ్ కారణంగా ధర విపరీతంగా పెట్టాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మంచి ధర లభించడం కారణంగానే పసుపు పండించాలనుకుంటున్నామని రైతులు చెబుతున్నారు.

నిరుడు వేసిన విత్తనంతోనే..

నిరుడు అర ఎకరంలోనే పసుపు పంట వేయగా ధర బాగా వచ్చింది. ఇప్పుడు నాదగ్గర ఉన్న విత్తనంతోనే ఎకరంలో పసుపు పంట వేసిన. పసుపు విత్తనం ఉంటే ఇంకా ఎక్కువగా పసుపు పండించేవాన్ని. పసుపు విత్తనాన్ని లక్ష్మీగా కొలుస్తారు కాబట్టి మార్కెట్లో కొందామన్నా పసుపు విత్తనం దొరకదు. ఒక వేళ ఎవరైనా అమ్మినా ఈసారి పసుపునకు ధర ఎక్కువగా రావడం కారణంగా విత్తనాలకు కూడా ధర విపరీతంగా పెట్టాల్సి వస్తున్నది. గతేడాది పసుపు పండించని వారు విత్తనాల కోసం ఇబ్బందులు పడుతున్నారు.

-పార్శపు శ్రీకాంత్, రైతు, కమ్మర్‌పల్లి

మక్కజొన్న పంట వేస్తున్నాం..

సోయా పంట పండించినా తెగుళ్ల కారణంగా దిగుబడులు రాక నష్టపోయినం. అందుకే ఇప్పుడు మక్కజొన్న పంటను సాగు చేద్దామనుకుంటున్నం. ఎకరానికి సోయాలో దిగుబడి రెండు క్వింటాళ్లు కూడా దాటలేదు. కష్టపడి నష్టపోయే బదులు మక్కజొన్న పండించాలని అనుకుంటున్నాం. మక్కజొన్న పండించడంవల్ల దిగుబడులు రావడంతోపాటు ధర కూడా భారీగా తగ్గడం అంటూ ఉండదు. నష్టపోయే అవకాశాలు ఉండవు . అందుకే మక్కజొన్న పంటను పండిస్తున్నాం.

-మహేందర్, రైతు, గాండ్లపేట్

సుపోషా సంఘం ఆధ్వర్యంలో

చేపల విక్రయం

కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్ గ్రామంలో మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చేపలు విక్రయించారు. చేపలు తింటే ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలకు సంబంధించి చేపలు విక్రయించే ప్రదేశంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. సహకార సంఘం వద్ద చేపలు కొనుగోలు చేసి ప్రజలకు కిలో చేపలు 150 రూపాయలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. చేపలకు సంబంధించిన అన్ని రకాల ఆర్డర్లను తీసుకుంటామని, పచ్చళ్లు కూడా తయారుచేసి ఇస్తామని పేర్కొన్నారు.

-మోర్తాడ్, జూన్ 9

వరినాట్లు..

నిజామాబాద్ రూరల్ మండలంలో ఆదివారం వరినాట్లు ప్రారంభించారు. ప్రతిఏటా సీజన్‌లో వరినాట్లు మండలంలోనే మొదటగా వేయడం ప్రారంభిస్తారు. రైతులందరూ బోరుబావులు కలిగి ఉండడంతో వరి పంటను సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని మల్కాపూర్ తండా గ్రామశివారులో ఉన్న మొగులాలి చెరువు ఆయకట్టు కింద వందలాది ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారు.

-సారంగాపూర్, జూన్ 9

మల్కాపూర్ తండాలో వరినాట్లు వేస్తున్న రైతులు

పీఎస్‌ఆర్ పార్కులో పోచారం

బాన్సువాడ, జూన్ 9: బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని పీఎస్‌ఆర్ మల్టీజనరేషన్ పార్కును మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శనివారం రాత్రి సందర్శించారు. పార్కులో చిన్నారులతో కలిసి సరదాగా గడిపారు. సందర్శకులతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకొన్నారు. ఆహ్లాదం పంచడానికి పార్కును ఏర్పాటు చేయడంతోపాటు బాన్సువాడ పట్టణాన్ని అభివృద్ధి చేసిన పోచారం శ్రీనివాసరెడ్డికి సందర్శకులు ధన్యవాదాలు తెలిపారు. పోచారం వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నార్ల రవీందర్ గుప్తా, కౌన్సిలర్ దొన్కంటి వెంకటేశ్, దావుద్ తదితరులు ఉన్నారు.

పీఎస్‌ఆర్ పార్కు లో చిన్నారులు, సందర్శకులతో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి